
TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 231 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.18.03.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




## హ్యాం రోడ్ల పేరుతో రూ.18 వేల కోట్ల కుంభకోణం



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో హ్యాం రోడ్ల పేరుతో రూ.18 వేల కోట్ల కుంభకోణానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి హరీశ్ రావు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లో అసెంబ్లీలో మీడియాతో వారు చిట్‌చాట్ నిర్వహించారు. ఆర్ అండ్ బీ రూ.12 వేల కోట్లు, పంచాయతీరాజ్ శాఖ రూ.ఆరు వేల కోట్లలో పది శాతం మొబిలైజేషన్ అడ్వాన్సులు పెట్టారని అన్నారు. రూ.1,800 కోట్లు నేరుగా వస్తాయనీ, వాటిని నాలుగు రాష్ట్రాల ఎన్నికలకు పంపేందుకు ప్రణాళిక రూపొందించారని చెప్పారు. జలయజ్ఞం కాదు ధనయజ్ఞమనీ, జేబులు దండుకుంటున్నారనీ, నాడు తెలుగుదేశం, రేవంత్‌రెడ్డి అంతటా ప్రచారం చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కమీషన్ల కోసమే హ్యాం రోడ్ల పేరుతో రూ.వేల కోట్లు దండుకునేందుకు ప్రణాళిక వేశారని అన్నారు. దేశం మొత్తం జాతీయ రహదారులు సాధారణంగా 20 నుంచి 30 శాతం వరకు టెండర్లు తక్కువ ధరకు వెళ్తాయని చెప్పారు. కానీ ఇప్పుడు రాష్ట్రంలో 15 నుంచి 20 శాతం అధిక ధరకు వెళు న్నాయని వివరించారు. తేడా 50 శాతం వస్తోందన్నారు. సీఓటీకి వెళ్లకుండా నేరుగా శాఖాపరమైన కమిటీ ఆమోదించేలా చేశారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మొబిలైజేషన్ అడ్వాన్సుల విధానాన్ని రద్దు చేసిందని గుర్తు చేశారు. నాడు జలయజ్ఞంలో మూడు శాతం మొబిలైజేషన్ అడ్వాన్సులు ఉంటే... ఇప్పుడు పది శాతానికి పెంచారని వివరించారు. మొత్తం 34లో ఇప్పటి వరకు తెరిచిన 24 టెండర్ల సాంకేతిక బిడ్లు చూస్తే దాదాపు 16 టెండర్లలో ఇద్దరు మాత్రమే వేశారని చెప్పారు. ముందే రింగ్ అయ్యారని విమర్శించారు. కుమ్మక్కై ముందే మాట్లాడుకుని అధిక ధరకు టెండర్ వేసేలా చేశారని అన్నారు. ఇప్పటివరకు టెండర్ ధరలో ఐదు శాతం మాత్రమే ఎక్కువకు వెళ్లేలా సీలింగ్ ఉండేదనీ, ఇప్పుడు హ్యాం రోడ్లకు ఆ నిబంధనను ఎత్తేయడంతో ఎంత ఎక్కువకు అయినా వేసుకోవచ్చని చెప్పారు. హ్యాం రోడ్ల టెండర్లలో పెద్ద కుంభకోణం జరిగిందని విమర్శించారు. నల్లగొండలో రెండు కంపెనీలు మాత్రమే టెండర్లు వేశాయన్నారు. టెండర్లలో అవినీతి జరిగిందనీ, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. దీనిపై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు, రిజర్వ్ బ్యాంకుకు ఫిర్యాదు చేస్తామన్నారు. టెండర్లలో పాలు పంచుకున్న అధికారులు, కాంట్రాక్టర్లపై బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ పద్దులు చర్చకు వచ్చినపుడు బీఆర్ఎస్ తరపున మరిన్ని ఆధారాలు బయటపెడతామని చెప్పారు. హైకోర్టు విచారణకు పట్టుబడతామని అన్నారు. సింగరేణి శ్రీరాంపూర్ టెండర్ వ్యవహారాన్ని తాము బయటపెట్టిన తర్వాత తక్కువ టెండర్‌కు పోయిందని గుర్తు చేశారు.

## గవర్నర్ ప్రసంగం తప్పుల తడక



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్‌తో రాష్ట్ర ప్రభుత్వం అసత్యాలు, అవాస్తవాలు చెప్పించిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ విమర్శించారు. మంగళవారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన వారి గురించి గవర్నర్ ప్రసంగంలో ఎందుకు ప్రస్తావించలేదని నిలదీశారు. కేసీఆర్ మీద ఉన్న కోపాన్ని తెలంగాణ తల్లిపై చూపించారని ఆరోపించారు. ఉద్యమంలో తెలంగాణ గుండె చప్పుడును ప్రతిబింబించిన విగ్రహాన్ని ఎందుకు మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. గతేడాది ప్రతిపాదిత బడ్జెట్లో 60 శాతం నిధులను మాత్రమే ఖర్చు చేశారని ఆరోపించారు. అప్పుల్లో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాన్ని అధిగమిస్తోందని ఎద్దేవా చేశారు. 2025-26 ప్రతిపాదిత రుణం రూ.54 వేల కోట్లు కాగా, లక్ష్యాన్ని అధిగమించి రూ.69,143 కోట్లు రుణం చేశారన్నారు. రెండున్నర ఏండ్లలో కేవలం 17 వేల ఉద్యోగాలను మాత్రమే ఇచ్చారని గుర్తు చేశారు. అయితే గత సర్కార్ ఇచ్చిన ఉద్యోగాలను కూడా తన ఖాతాలో వేసుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో చిత్త శుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. కులగణన లెక్కలను బహిర్గతం చేయడంతో పాటు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. మూసీ బఫర్ జోన్లో ఉన్న ధనవంతుల ఇండ్లను కూల్చకుండా పేదలపైనే సర్కార్ తన ప్రతాపాన్ని చూపిస్తోందని విమర్శించారు. దావోస్ పెట్టుబడులపై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. మహిళలకు రూ.2,500, కాలేజి విద్యార్థులకు స్కూటీలు, కళ్యాణ లక్ష్మి లబ్దిదారులకు తులం బంగారం మొదలగు ఎన్నికల ముందిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండున్నర ఏండ్లలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా విఫలమైందని ఆరోపించారు.

పొన్నం వర్సెస్ దాసోజు

శాసన మండలిలో గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తెలంగాణ తల్లి విగ్రహం మార్పు, బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో దాసోజు చేసిన ఆరోపణలపై మంత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు. గత సర్కార్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఏర్పాటు చేయకపోవడంతోనే తమ ప్రభుత్వం తెలంగాణ గీతంతో పాటు తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో చట్ట బద్ధంగా చేయాల్సిందంతా రాష్ట్ర ప్రభుత్వం చేసిందనీ, తుది నిర్ణయం కేంద్రం తీసుకోవాల్సి ఉందని గుర్తు చేశారు. మంత్రి వ్యాఖ్యలతో దాసోజు ఏకీభవించలేదు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యులు పోటాపోటీగా నినాదాలు చేశారు. ఈ దశలో జోక్యం చేసుకున్న చైర్మెన్ ఇరువర్గాలకు సర్ది చెప్పడంతో దాసోజు తన ప్రసంగాన్ని కొనసా గించారు. అనంతరం సభను బుధవారం ఉదయం 10 వాయిదా వేస్తున్నట్టు చైర్మెన్ ప్రకటించారు.

## ప్రజాపాలనకు దర్పణం గవర్నర్ ప్రసంగం



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనకు ఉభయసభలనుద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం అద్దం పట్టిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మంగళవారం శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం ప్రారంభం కాగానే గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను చేపట్టింది. చర్చను మహేశ్ కుమార్ గౌడ్ ప్రారంభిస్తూ మూసీ పునర్జీవం, గోదావరి జలాలను తరలించేందుకు, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎయిర్ పోర్టుల నిర్మాణం, ఏకకాలంలో రూ.21 వేల కోట్ల రుణమాఫీ, సన్నధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ తదితర కార్యక్రమాలను ఆయన వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరాన్ని కూలిపోయేలా నిర్మించి, పాలమూరు - - రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసి, మిగిలిన ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టిందని ఆయన విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు బీసీలకు అన్యాయం చేస్తే తమ ప్రభుత్వం వారికి న్యాయం చేసిందని చెప్పారు. బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తున్నాయన్నారు. మూసీ కంపును అలాగే ఉంచితే పెట్టుబడులు వస్తాయా అని ఆయన ప్రశ్నించారు.


ప్రజా ప్రతినిధులందరికి డ్రగ్స్ టెస్ట్

రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులందరూ డ్రగ్స్ టెస్ట్‌కు సిద్ధం కావాలని మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో డ్రగ్ కల్చర్ పెంచిందని ఆయన విమర్శించారు. డ్రగ్స్‌ను కూకటివేళ్లతో పెకిలించి వేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా డ్రగ్స్ టెస్ట్‌కు సిద్ధంగా ఉన్నారనీ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ కూడా సిద్ధపడాలని సవాల్ విసిరారు.కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ప్రజాపాలనకు నిలువుటద్దంగా గవర్నర్ ప్రసంగం ఉందన్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నదనీ, విశ్వవిద్యాలయాలను బలోపేతం చేస్తున్నదని తెలిపారు.

అవాస్తవాలతో గవర్నర్ ప్రసంగం : మధుసూదనాచారి

గవర్నర్ ప్రసంగం అవాస్తవాలతో నిండుకుని ఉందని శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి విమర్శించారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించలేదనీ, పంట పెట్టుబడి సహాయం ఇవ్వడం లేదనీ, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 ఇవ్వలేదనీ, బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించిన నిధులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సరఫరా చేయడంలో, బీసీలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసు..సిట్ ఏర్పాటు




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసు దర్యాప్తునకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. సీపీ సుధీర్ బాబు పర్యవేక్షణలో తొమ్మిది మంది అధికారులతో సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్ఎస్ నేత, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పామ్ హౌస్‌లో ఇటీవల మద్యం పార్టీ తీవ్ర కలకలం రేపింది.

శనివారం రాత్రి నిర్వహించిన ఈ వేడుకలో డ్రగ్స్ వినియోగిస్తున్నారనే సమాచారం రావడంతో ఈగల్ పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. 11 మందిని పరీక్షించగా ఇందులో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ అయిన వారిలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, పైలట్ రోహిత్ రెడ్డి ఉన్నారు. పోలీసులు సోదాలకు వెళ్లిన సమయంలో నమిత్ శర్మ అనే వ్యక్తి వారి పైకి కాల్పులు జరిపాడు.

దీనికి సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారు. మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో 11 మందిపై కేసు నమోదు చేశారు. పైలట్ రోహిత్ రెడ్డిని ప్రధాన నిందితుడిగా పేర్కొన్నారు. పైలట్ రోహిత్ రెడ్డి ఆదేశాలతోనే నమిత్ శర్మ కాల్పులు జరిపినట్లు అభియోగాలు నమోదు చేశారు. పైలట్ రోహిత్ రెడ్డితో పాటు ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు, ఎనిమిది మందికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, నమిత్ శర్మలను జడ్జి ముందు ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించారు. దీనితో వారిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## దేశానికే ఆదర్శంగా తెలంగాణలో ప్రకృతి వ్యవసాయం




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: దేశానికే ఆదర్శంగా తెలంగాణలో ప్రకృతి వ్యవసాయం ఉండబోతున్నదనీ, 61,125 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ సాగుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా రైతులకు ఫార్మర్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయానికి పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని రైతులు ఈ విధానాన్ని అవలంబించాలని సూచించారు. రూ.42 కోట్లతో ఈ పథకాన్ని అమలుచేస్తున్నట్టు, దానిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 489 క్లస్టర్లు దాదాపు 61,125 ఎకరాలలో ఈ సంవత్సరం ప్రకతి వ్యవసాయం సాగు విధానంలోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికా రూపొందిస్తున్నట్టు వివరించారు. సాగులో, మార్కెటింగ్‌లో తోడ్పడే విధంగా కృషిసఖిలను క్లస్టర్‌కు ఇద్దరు చొప్పున నెలకి రూ.5 వేలు గౌరవ వేతనం ఇచ్చి నియమించామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన బీజామృతం, జీవామృతం, దశపర్ణి వంటి జీవ ఉత్పాదకాలు స్వయంగా తయారు చేసుకోలేని రైతుల కోసం ప్రభుత్వం జీవ ఉత్పాదక తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహిస్తున్నామనీ, ప్రతి బీఆర్‌సీకి లక్ష రూపాయల చొప్పున కేటాయించామని చెప్పారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 20న నర్మెట్టలో రైతు మహోత్సవాన్ని ప్రారంభిస్తున్నామనీ, అందులో రైతులు, ఆదర్శరైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహోత్సవంలో వ్యవసాయ, పశుసంవర్ధక, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే దాదాపు 150 ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 22న నర్మెట్టలో సీఎం చేతుల మీదుగా మొదటి విడత రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 20,600 కోట్ల రైతు రుణమాఫీ ఒకే దఫాలో విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

# ఖోడద్ అభివృద్ధికి ఉద్యోగుల కృషి అభినందనీయం : జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఖోడద్ అభివృద్ధికి ఉద్యోగుల కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం తలమడుగు మండలం ఖోడద్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసంగిస్తూ, గ్రామంలో విజ్ఞానాన్ని పంచేందుకు లైబ్రరీని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామం నుండి ఎదిగిన ఉద్యోగులు తమ ప్రాంతంపై మమకారంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047' బ్లూప్రింట్‌ను సిద్ధం చేసిందని తెలిపారు. ఈ అభివృద్ధిలో గ్రామాలు కీలక పాత్ర పోషించాలని, ముఖ్యంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. ఉద్యోగాల కోసం సన్నద్ధమయ్యే యువతకు ఈ గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. సివిల్ సర్వీసెస్ వంటి కఠినమైన పరీక్షలను సాధించాలంటే పట్టుదల, సరైన ప్రణాళిక అవసరమని తన సొంత అనుభవాలను కలెక్టర్ యువతతో పంచుకున్నారు. గ్రామంలోని ఉద్యోగులంతా కలిసి యువతకు కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాలపైనే కాకుండా, స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ రంగాల్లో కూడా రాణించాలని కోరారు. గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీఓ శంకర్, గ్రామ ఉద్యోగుల సంఘం సభ్యులు వెంకట్, నర్సింలు, చంద్రారెడ్డి, అనిల్ రెడ్డి, స్వామి, అశోక్, భోజా రెడ్డి, గౌతమ్, గోవర్ధన్, లలిత, స్వామి, గ్రామ యువత, గ్రామస్తులు, గ్రంథాలయ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా తాంసి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మిత్ర ఎన్జీఓ సహకారంతో ఏర్పాటు చేసిన రూ. 2 లక్షల విలువైన నూతన వైద్య పరికరాలను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆసుపత్రిలో విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. లేబర్ రూమ్‌లో అవసరమైన టేబుల్స్, స్ట్రెచర్లు, డిజిటల్ బీపీ అపారటస్, రోగుల భద్రత కోసం సీసీటీవీ కెమెరాలను విరాళంగా అందించిన ఎస్బీఐ అధికారులకు, మిత్ర ఎన్జీఓ ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు చిన్నపాటి అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆరోగ్య ఉప కేంద్రాలు లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. సకాలంలో వైద్యం చేయించుకోవడం ద్వారా పెద్ద వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారని, ప్రజలు ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకాన్ని పెంచుకోవాలని కోరారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ త్వరలోనే జిల్లాలో ప్రతి మహిళకు 'హెల్త్ ప్రొఫైల్' తయారు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. పీహెచ్‌సీ, సబ్ సెంటర్ల స్థాయిలో ప్రతిరోజూ 50 మంది మహిళలకు 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య స్థితిగతులను నమోదు చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్బిఐ రీజనల్ మేనేజర్ రామచంద్ర రావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఉత్పల్ కుమార్, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, తహసీల్దార్ లక్ష్మీ, ఎంపీడీఓ మోహన్ రెడ్డి, తాంసి బ్రాంచ్ మేనేజర్ శైలేష్, మైత్రి హోలిస్టిక్ హెల్త్ సొసైటీ లక్ష్మి రెడ్డి, డాక్టర్ శ్రావ్య వాణి, సర్పంచ్ సంతోష్ రెడ్డి, ఉప సర్పంచ్ గంగారెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం ప్రారంభం: జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ పశువుల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సామూహిక ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజాపాలనబిప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం తలమడుగు మండల కేంద్రంలోని పశువైద్యశాలలో 8వ విద్యా జాతీయ ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని, అవగాహన కల్పించే ప్రచార రథాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు టీకాలు వేసే ప్రక్రియను స్వయంగా పరిశీలించి, కార్యాలయ ఆవరణలో కలెక్టర్ మొక్కను నాటి నీరుపోశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా ఉన్న 2,90,000 ఆవులు, 48,000 గేదెలకు ఈ నెల రోజుల పాటు సాగే ప్రత్యేక కార్యక్రమంలో టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి వల్ల పాడి రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని, అందుకే రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పశువులకు ఉచితంగా టీకాలు వేయించుకోవాలని ఆయన కోరారు. ప్రచార రథం ద్వారా పల్లెల్లో రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

అనంతరం కలెక్టర్ పశువైద్యశాల రికార్డులను తనిఖీ చేసి, అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు.

అనంతరం గ్రంథాలయాన్ని, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు, డాక్టర్ లావణ్య, తహసిల్దార్ రాజ్ మోహన్, రైతులు, గ్రామస్తులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# జనాభా గణన సమర్థవంతంగా నిర్వహించాలి

భువనగిరి :అమృత్ తెలంగాణ: జనాభా గణన-2027 ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, ఛార్జ్ అధికారులు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. మంగళవారం చివరి రోజు జనాభా గణన--సెన్సెస్ 2027కు సంబంధించి చార్జి అధికారుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని రెండు దశల్లో నిర్వహించే గణనను సమగ్రంగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జనాభా గణనను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. హౌస్ లిస్టింగ్ ను కచ్చితంగా చేసినట్లయితే సెన్సెస్ పూర్తి అయినట్లే అని అన్నారు. బ్లాక్ ల వారీగా ఏర్పాటు చేసుకొని సులభతరంలో సెన్సెస్ చేయాలన్నారు. ప్రతి దశను క్షేత్రస్థాయిలో, పారదర్శకంగా సెన్సెస్ నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జనాభా గణన సెన్సెస్ -2027 ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, సమగ్ర సమాచారం సేకరణపై దృష్టి పెట్టాలని అన్నారు .ప్రభుత్వం చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి అధికారి తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. డిజిటల్ విధానంలో జరగనున్న ఈ ప్రక్రియలో ప్రతి ఇంటిని, ప్రతి వ్యక్తిని చేర్చడంతో వారి వివరాలను తప్పకుండా నమోదు చేయాలన్నారు. అలాగే, ప్రజల సహకారం కూడా అత్యంత కీలకమని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి జనాభా గణనకు ప్రజలను చురుకుగా భాగస్వాములను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, మరియు జిల్లా గణాంక అధికారివెంకటరమణ,మున్సిపల్ కమిషనర్లు, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు చేరువ కావాలి

## ఆధునిక సాగు పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ఆత్మ' (ATMA) జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయ అభివృద్ధి కోసం వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖలు సమన్వయంతో కార్యక్రమాలు అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రత్యేకంగా మత్స్య సంపద అభివృద్ధిపై దృష్టి సారించాలని, చేపల పెంపకం, నిల్వ, హార్వెస్టింగ్ అనంతరం చేపట్టాల్సిన ఆధునిక సాంకేతిక విధానాలపై రైతు సమూహాలు, మహిళా సంఘాలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. దీంతో మత్స్య ఆధారిత విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై రైతుల్లో అవగాహన పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రైతులకు సులభంగా అర్థమయ్యే విధంగా ప్రతి శిక్షణ కార్యక్రమంలో ప్రభుత్వ రూపొందించిన వీడియోలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు, ప్రత్యక్ష నమూనాలు ప్రదర్శించాలని స్పష్టం చేశారు. రాబోయే మూడు నెలల కాలం వ్యవసాయ పరంగా కీలకమని, వర్షాకాలం ప్రారంభానికి ముందే అన్ని శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయాలని అధికారులకు గడువు విధించారు.

ప్రతి మండలంలో ఎంపీడీఓలు నాయకత్వ బాధ్యతలు చేపట్టి అన్ని అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలు సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అలాగే జిల్లాలో త్వరలోనే 'కిసాన్ మేళా' నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ మేళాలో ప్రగతిశీల రైతులను ఆహ్వానించి వారి అనుభవాలను ఇతర రైతులతో పంచుకునేలా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అదేవిధంగా సేంద్రీయ వ్యవసాయం, కిచెన్ గార్డెనింగ్, రూఫ్‌టాప్ గార్డెనింగ్ వంటి అంశాలపై ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని డీపీఆర్ఓ ను కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన పంటల అధికారి రమణ, మత్స్య శాఖ ఎడి రాజ నర్సయ్య, వెటర్నరీ అధికారి బాలిగ్ అహ్మద్, జెడ్పీ సీఈవో శంకర్, ఎల్డీఎం రామ్ గోపాల్, ఇతర అధికారులు, ఆత్మ కమిటీ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లాలో ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె ఈ విషయం తెలిపారు. పారిశ్రామిక అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూములపై కొందరు వ్యక్తులు అక్రమంగా కన్నేసి నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు పొందినట్లు అధికారుల దృష్టికి వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. దీనిపై రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టగా అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పొందిన పట్టాలను తక్షణమే రద్దు చేసినట్లు వెల్లడించారు. అలాగే ఆక్రమణకు గురైన భూమిని రెవెన్యూ అధికారులు తిరిగి స్వాధీనం చేసుకుని పారిశ్రామిక శాఖకు అప్పగించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమి ప్రజల ఆస్తి అని, దానిని అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఆక్రమణదారులపై కచ్చితంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ భూములపై ఆక్రమణలు జరగకుండా నిరంతర నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే ప్రజలు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు.

# జిల్లాలో గ్యాస్ సిలిండర్ ల కొరత లేదు..ప్రజలు గ్యాస్ కొరత పుకార్లను నమ్మవద్దు: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.




నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లాలో డొమెస్టిక్, కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకు ఎటువంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. అన్ని గ్యాస్ ఏజెన్సీలలో తగినంత గ్యాస్ అందుబాటులో ఉందని తెలిపారు. గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకున్నవారికి నిర్ణీత సమయంలోపల సిలిండర్లను ప్రజలకు డోర్ డెలివరీ చేస్తున్నట్లు వివరించారు. ప్రజలకు ఎవరికైనా గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు కలిగితే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబరు 91005 77132 ను సంప్రదించ వచ్చునని వివరించారు. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ల ఏజెన్సీ లతో సమావేశం నిర్వహించి, ప్రజలకు సరిపడినన్ని సిలిండర్లను సాఫీగా పంపిణీ చేసే విధంగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. ప్రజలు ఎవరు గ్యాస్ కొరత అని వస్తున్న అసత్య వార్తలను, పుకార్లను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

# అక్రమ మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ అక్రమ మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. మంగళవారం సారంగాపూర్ మండలంలోని జాం గ్రామ చెరువు సమీపంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల అవసరాల కోసం మొరం తవ్వకాలు చేపట్టాల్సి వచ్చినప్పుడు తప్పనిసరిగా రెవెన్యూ అధికారుల అనుమతి పొందిన తర్వాత మాత్రమే తవ్వకాలు చేయాలని సూచించారు. అక్రమ మొరం తవ్వకాలపై రెవెన్యూ అధికారులు పటిష్ట నిఘా ఉంచాలని ఆదేశించారు. మొరం, ఇసుక అక్రమ తవ్వకాలు చేసే వారిపై అలాగే అక్రమంగా రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, మైనింగ్ అధికారి హరి ప్రసాద్, తహసిల్దార్ సంధ్యారాణి, రెవెన్యూ అధికారులు, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



# రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలి

## ప్రతి రైతుకు రుణమాఫీ అమలు చేయాలి
## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని
## ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసిన బిజెపి నాయకులు



ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ: మార్చి 17 ఇబ్రహీంపట్నం మండలం బిజెపి మండల అధ్యక్షులు బాయిలింగారెడ్డి ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలని రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలని ప్రతి రైతుకు రుణమాఫీ అమలు చేయాలని ఎమ్మార్వో కు మండల శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ వెంకటేష్ యాదవ్ కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు సంజీవరెడ్డి ఎల్లా శ్రీనివాస్ లవంగ రాజశేఖర్ దేవన్న బుద్ధం నరేష్ కోటగిరి వెంకటస్వామి గుండేటి సతీష్ పోస్తే మహేందర్ పసునూరి కిరణ్

# ఖానాపూర్ మాజీ శాసనసభ్యులు అజ్మీర గోవింద్ నాయక్ అంత్యక్రియల్లో పాల్గొన్న బోథ్ MLA అనిల్ జాదవ్



ఖానాపూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అజ్మీర గోవింద్ నాయక్



అంత్యక్రియల్లో మాజీ మంత్రివర్యులు జోగు రామన్న ,బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ మరియు ఇతర ప్రజా ప్రతినిధులు నాయకులతో కలిసి బోత్ శాసనసభ్యులు అనిల్ జాదవ్ గోవింద్ నాయక్ గారి భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గోవింద్ నాయక్ గారు ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండే నిజమైన ప్రజానాయకుడని, ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి మృతి ఉమ్మడి జిల్లా ప్రజలకు, రాజకీయ వర్గాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో గోవింద్ నాయక్ గారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. గోవింద్ నాయక్ గారి సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, ఆయన ప్రజాసేవా స్ఫూర్తి అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.


# శుభకార్యానికి హాజరైన టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ బలరాం



అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన జాదవ్ పవన్ కళ్యాణ్ బిఆర్ఎస్ కార్యకర్త పెళ్లి రిసెప్షన్ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ మరియు ఉపాధ్యక్షుడు ఆడే బాపురావ్ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు

# చిట్ ఫండ్స్ నడుపుతూ వందల సంఖ్యలో బాధితులను మోసం చేసిన ఘరానా మోసగాడు అరెస్ట్.

**అక్షర చిట్ ఫండ్ ఎండి ఓ మేనేజింగ్ డైరెక్టర్ పేరాల శ్రీనివాసరావు అరెస్ట్.**
**ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో 12 కేసులు నమోదు.**
**12 మంది 99 లక్షలు చెల్లించగా, వారికి తిరిగి కోటి 11 లక్షలు ఇవ్వాల్సి ఉంది.**
**రాష్ట్రవ్యాప్తంగా 96 చీటింగ్ కేసుల నమోదు.**
**గత ఆరు నెలలుగా తప్పించుకుంటూ తిరుగుతూ సోమవారం పట్టుబడ్డ నిందితుడు.**
**ఐదు మొబైల్ ఫోన్స్, ఒక ఐ ప్యాడ్, డొంగల్ స్వాధీనం**
**వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ .**
**నిందితుడు వివరాలు**
**పేరాల శ్రీనివాసరావు (49) ం/శీ భీమ్ రావు, ఎండి ఓ చైర్మన్ అక్షర చిట్ ఫండ్స్ ప్రొవైడ్ లిమిటెడ్ కంపెనీ,**
**వడ్డేపల్లి, హనుమకొండ.**
**రాష్ట్రవ్యాప్తంగా వందల మందిని చిట్ ఫండ్స్ నడుపుతూ వందల మంది డిపాజిట్స్ కు డబ్బు తిరిగి చెల్లించకుండా మోసం చేసి గత కొన్ని నెలలుగా తప్పించుకుంటూ తిరుగుతూ ఉన్న ఘరానా మోసగాడు పేరాల శ్రీనివాసరావును అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు.**



నిందితుడు

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ వివరాలలో నిందితుడు తన అక్షర చిట్ ఫండ్స్ సంస్థ ద్వారా ప్రజలను ఆకర్షించడానికి అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చిట్ స్కీములు ప్రారంభించాడు. విశ్వసనీయంగా కనిపించేలా కార్యాలయాలు ఏర్పాటు చేసి, ఏజెంట్ల ద్వారా ప్రజలను చిట్టీల్లో చేరేలా ప్రోత్సహించాడు. ఈ క్రమంలో ఆదిలాబాద్ జిల్లా సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వందల మంది డిపాజిటర్ల నుండి పెద్ద మొత్తంలో డబ్బులు సేకరించి, గడువు వచ్చిన తరువాత డబ్బులు తిరిగి చెల్లించకుండా మోసం చేశాడు. ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఇప్పటివరకు 12 కేసులు నమోదు కాగా, బాధితులు రూ. 99 లక్షలు చెల్లించగా వారికి సుమారు రూ. 1.11 కోట్లు తిరిగి ఇవ్వాల్సి ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా 96 చీటింగ్ కేసులు నమోదయ్యాయి. కేసులు నమోదు కావడంతో నిందితుడు గత ఆరు నెలలుగా పోలీసులను తప్పించుకుంటూ పరారీలో తిరుగుతున్నాడు. అయితే పోలీసుల ప్రత్యేక బృందం సాంకేతిక ఆధారాలు మరియు గోప్య సమాచారం ఆధారంగా నిందితుడిని గుర్తించి సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించారు. నిందితుని వద్ద నుండి 5 మొబైల్ ఫోన్లను, ఒక ఐపాడ్ ను, ఒక డొంగల్ ను స్వాధీనం చేసుకోవడం జరిగింది.

ప్రజలకు సూచనలు -- ప్రైవేట్ చిట్ ఫండ్స్ పట్ల జాగ్రత్త

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రజలకు పలు సూచనలు చేశారు:

అధిక లాభాలు వస్తాయని చెప్పే ప్రైవేట్ చిట్ ఫండ్స్ లేదా పెట్టుబడి పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

సంస్థ ప్రభుత్వ అనుమతులతో పనిచేస్తుందా లేదా అనేది ముందుగా నిర్ధారించుకోవాలి.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

సరైన రిజిస్ట్రేషన్, అధికారిక పత్రాలు లేకుండా నడిచే సంస్థలలో డబ్బులు పెట్టుబడి పెట్టకూడదు.

ఏజెంట్లు లేదా పరిచయస్తుల మాటలను నమ్మి పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వకూడదు.

అనుమానాస్పద పెట్టుబడి పథకాలపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. ప్రజలను మోసం చేసే ఆర్థిక నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం జరిగేలా పోలీసులు కట్టుదిట్టంగా చర్యలు కొనసాగిస్తారని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, టూ టౌన్ సీఐ కె నాగరాజు, ఎస్ఐ అఖిల్, ఆర్ఎస్ఐ గోపికృష్ణ, ఐటి కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన సోనాల బిఆర్ఎస్ నాయకుడు

అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ సోనాల మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బోరుగప్ప రాజారాం బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు వారికి ఆడే గజేందర్ గారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రజా పాలన చూసి కాంగ్రెన్ పార్టీలో చేరుతున్నాని వారు అన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు కుర్మే మహేందర్,లోలపు పోశెట్టి మునేశ్వర్ సోమన్న, భీంరావు పాటిల్,మురళి



గౌడ్,యండి సద్దాం తదితరులు ఉన్నారు

# రాజీవ్ యువ వికాస్ పథకం ఎక్కడ? భీమ్ ఆర్మీ అసెంబ్లీ ప్రెసిడెంట్ భగత్ ప్రవీణ్

అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ సోనాల మండల కేంద్రంలో భగత్ ప్రవీణ్ గారు మాట్లాడుతూ పథకం పేరుతో దరఖాస్తులు తీసుకోవడం తప్ప, యూనిట్లు మంజూరు చేయడం, బ్యాంక్ లోన్లు ఇవ్వడం, సబ్సిడీలు విడుదల చేయడం వంటి అసలు అమలు ప్రక్రియ ఎక్కడా కనిపించడం లేదు. గ్రామాల నుంచి పట్టణాల వరకు యువత పరిస్థితి ఒకటే అప్లై చేసాం... కానీ ఫలితం లేదు అంటున్నారు అని అన్నారు తక్షణమే ప్రభుత్వం స్పందించి, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని, అర్హులైన ప్రతి యువకుడికి యూనిట్లు మంజూరు చేసి, బ్యాంక్ లోన్లు మరియు సబ్సిడీలు




విడుదల చేయాలని డిమాండ్ చేశారు

# హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి ఏర్పాటు.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ పట్టణం లోని సంజయ్ నగర్ మరియు టైలర్స్ కాలనీ బస్తీలోని హిందూ సమ్మేళనాన్ని నిర్వహించడానికి హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి ఏర్పాటు చేయడం జరిగింది. హిందూ బంధువులు అందరూ కలిసి స్థానిక శివాలయం లో సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి కమిటీని ఎన్నుకోవడం జరిగింది. హిందు సమ్మేళన నిర్వహణ సమితి–కార్యవర్గం అధ్యకుడు కదిరే శ్రీధర్ గౌడ్ ఉపాధ్యక్షులు: గొప్కల స్వాదు శ్రీమతి సుభద్రమ్మ,శ్యామ్ రావ్,ఆడే బాపురావ్,రాజేశ్వర్, జూకంటి విజయ్ మోహ ప్రధాన కార్యదర్శి: శ్రీ ఉడుగు భూమన్న సహకార్యదర్శులు: కుసాల సతీష్, బండారి హన్మాండ్ల పందిరి రవిష్ కుమార్,బోండ్ల అభిలాష్ ,తలాల భూమన్న, ఊషన్న కోశాధికారి: జమ్మికుంట మురళి అడిటర్:వెంకట రమణ కార్య నిర్వహణ సభ్యులు మంచాల సంజయ్, ఈరవేణి పోచ్చన్న, సంతోషం పొచ్చన్న దాసరి లక్ష్మణ్, ఉడుగు రవితేజ, అఖిల్ రెడ్డి వినోద్ , బాండ్ల పుష్పలత, అన్నం రమ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ ఏప్రిల్ 11 వ తేదీన సాయంత్రం 4:30 కు స్థానిక హిందూ సమాజం సంఘటితం కొరకు హిందూ సమ్మేళనం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో బట్టి సావర్గవ్ , రిక్షాకాలని, ఫిల్టర్ బెడ్, టైలర్ కాలనీ, ఎల్బిఎస్ నగర్, పోలీస్ కాలనీ, ఆదర్శ నగర్, కాలనీల నుండి అత్యధిక హిందూ బంధువులు కుటుంబాలతో హాజరై హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలని కోరారు. తదితరులు పాల్గొన్నారు

# ఆశ వర్కర్లకు ఫిక్స్ వేతనం నిర్ణయించాలి: సీఐటీయూ



భువనగిరి. అమృత్ తెలంగాణ:ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం నిర్ణయించాలని ఆశ వర్కర్ల జిల్లా గౌరవ అధ్యక్షులు దాసరి పాండు అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆశ రాష్ట్ర బడ్జెట్లో బడ్జెట్ కేటాయించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ పనిచేస్తున్న ఏళ్ల తరబడిగా పట్టణాల్లో గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు ఫిక్స్ పెట్టండి నిర్ణయించకుండా చాకిరి చేయించుకుంటున్నదని అన్నారు. బడ్జెట్లో రాష్ట్ర బడ్జెట్లో ఆశ వర్కర్లకు బడ్జెట్ కేటాయించి ఫిక్స నిర్ణయించి వేతనాలు పెంచాలని నిర్వహించాలని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఆశ వర్కర్లకు సమస్యలు పరిష్కరిస్తామని చెప్పినా.. నేటికీ అమలు చేయలేదని అన్నారు. వెంటనే ఎప్పటికైనా వెంటనే బడ్జెట్ కేటాయించి నిర్ణయించాలని తగ్గించాలని ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యం కల్పించాలని సౌకర్యం కల్పించాలని అధికారులను ఆపాలని తదితర సమస్యలు పరిష్కరించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణఅంగన్వాడీ తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముక్కెర్ల వెంకటమ్మ, కసగోని లలిత, నాయకులు నాయకులు జ్యోతి, సంతోష, సుజాత, జమున, అరుణ, ధనలక్ష్మి, సైదమ్మ, లక్ష్మి లు పాల్గొన్నారు.

# జిల్లాలో గోదాముల పెంచేందుకు ఆమోదముద్ర..



భువనగిరి .అమృత్ తెలంగాణ: జిల్లాలో గోదాముల సదుపాయాన్ని పెంచేందుకు జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోందని యాదాద్రి భువనగిరిజిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు ఆధ్వర్యం లోని డిస్టిక్ కోపరేటివ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశంలో ఆమోదముద్ర వేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో గోదాముల సదుపాయం సరిపడినంత లేనందున భవిష్యత్తు అవసరాల దృష్ట్యా గోదాములను నిర్మించనున్నారు. వరల్డ్ లార్జెస్ట్ గ్రీన్ స్టోరేజ్ స్కీమ్ ద్వారా సహకార సంఘములకు ఈ గోదాములను నిర్మించనున్నారు. దీని కొరకు నాబార్డు నుండి ఆర్థిక సహాయం లభించనుంది. జిల్లాలో రైలు, రోడ్డు మార్గాలకు దగ్గరగా ఉండి గోదాముల నిర్మాణానికి అనువైన భూమిని కలిగి ఉన్న మూడు సహకార సంఘాలలో వీటిని నిర్మించనున్నారు. వీటి ద్వారా దాదాపుగా 40 వేల మెట్రిక్ టన్నుల గోదాముల సౌకర్యం జిల్లాలో అందుబాటులోకి రానున్నదనారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తక్కవ ధరలలో మందులు దొరికేశీదుకు పిఎసిఎస్ లలో జన ఔషధీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారని డిసిఓ మురళి రమణ తెలిపారు.

# మేరీ మాత విగ్రహాన్ని తొలగించిన నిందితులను అరెస్టు చేయాలి



భువనగిరి : అమృత్ తెలంగాణ:భువనగిరి మండల పరిధిలోని జమ్మాపురం గ్రామంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న మేరీ మాత విగ్రహంపై దాడి చేసి, విగ్రహాన్ని తొలగించి, కింద పడేసి అవమానపరిచిన నిందితులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మతసామరస్యంతో అందరు కలిసిమెలిసి ఉంటున్న యాదాద్రి భువనగిరి జిల్లాలో మతాల మధ్యన చిచ్చు పెట్టి మత సామరస్యాన్ని దెబ్బ తీయాలని ప్రయత్నం చేస్తున్న మతోన్మాద దుండగులను గుర్తించి వారిపై కఠినమైన చర్యలను తీసుకోవాలి పోలీసు యంత్రాంగానికి సూచించినారు.

మంగళవారం భువనగిరి మండల పరిధిలోని జమ్మాపురం గ్రామంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు మేరీ మాత విగ్రహంపై దాడి చేయడాన్ని ఖండిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లా, మండల నాయకత్వం, గ్రామ ప్రజలతో కలిసి విగ్రహాన్ని జహంగీర్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం భారతదేశంలో నివసిస్తున్న ప్రతి వ్యక్తి తమకు నచ్చిన మతాన్ని స్వీకరించి జీవించడానికి అవకాశం, హక్కు ఉన్నదని తెలిపారు. కానీ కొంతమంది మత ఉన్మాదులు దేశంలో మత ఘర్షణలు సృష్టించడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రధానంగా దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మైనారిటీ లైన ముస్లింలపైన, క్రైస్తవులపైన మరియు వారి యొక్క ఆరాధన కేంద్రాల పైన దాడులు, దౌర్జన్యాలు కొనసాగిస్తున్నారని విమర్శించారు. క్రైస్తవ మతంలో అత్యంత భక్తితో కొలువబడే మేరీ మాత విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి దుండగులు ప్రయత్నించి మేరీమాత విగ్రహాన్ని కింద పడేయడం దుర్మార్గమైన చర్యని అన్నారు.

# బొద్దింకలతో నిండిన గదిలో జాన్వీ బంధిఖానా



బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో క్షణం తీరిక లేకుండా ఉంది జాన్వీ కపూర్. ఈ యంగ్ బ్యూటీ నటించిన మిలీ ఎట్టకేలకు నవంబర్ 4న పెద్ద తెరపైకి వచ్చింది. పాజిటివ్ సమీక్షలతో మిలీ బాక్సాఫీస్ వద్ద బాగానే రాణించిందని ట్రేడ్ వెల్లడించింది. మత్తుకుట్టి జేవియర్ దర్శకత్వం వహించిన ఈ సర్వైవల్-థ్రిల్లర్ లో సన్నీ కౌశల్ – మనోజ్ పహ్వా కూడా ప్రధాన పాత్రలు పోషించారు. ఇది మలయాళ భాషా చిత్రం హెలెన్ కి రీమేక్. ఈ సినిమాని జాన్వీ తండ్రి బోనీకపూర్ స్వయంగా నిర్మించడం ఆసక్తికరం. పాపా బోనీ నిర్మాతగా మొదటి సహకారం జాన్వీకి చాలా ప్రత్యేకమైనది. తన స్పెషల్ సర్వైవల్ డ్రామాను ప్రచారం చేస్తూ తాజాగా జాన్వీ చెప్పిన ఓ సంగతి యువతరంలో హాట్ టాపిగ్గా మారింది. తాను బొద్దింకలతో నిండిన గదిలో ఎందుకు బంధించబడాలనుకుంటోందో జాన్వీ ఈ ఇంటర్వ్యూలో వివరించింది. ఒకవేళ బొద్దింకలతో నిండిన గదిలో బంధించబడితే లేదా మిలీ సినిమాలో లాగా ఫ్రీజర్ లో బంధించబడితే..? ఈ రెండిటిలో ఏది బెస్ట్.. మీరైతే ఏం చేస్తారు? మీ ఫీలింగ్ ఏంటీ? అంటూ హోస్ట్ జాన్వీ కపూర్ ని సరదాగా ప్రశ్నించారు. దానికి జాన్వీ ఆసక్తికర సమాధానం ఇచ్చింది. నేను ఫ్రీజర్ లోకి తిరిగి వెళ్లలేను. నేను బొద్దింకలతో నిండిన గదిలో బంధించబడితేనే బెటర్ అని చెప్పింది. ఫ్రీజర్లో ఉ ండటం చాలా కష్టంగా ఉందని కూడా జాన్వీ తెలిపింది. జాన్వీ కపూర్ మిలీ కథాంశం ఆసక్తికరం. ఒక ప్రముఖ ఫాస్ట్ ఫుడ్ ఫ్రాంచైజీలో వెయిటర్ గా పనిచేసి 48 గంటలకు పైగా ఫ్రీజర్ లో బంధించబడిన ఒక అమ్మాయి కథేమిటన్నది తెరపై చూపించారు.

# మరోసారి బోల్డ్ గా ఒంపుల్ని ప్రదర్శించిన ఇషా



టాప్ మోడల్ కం నటి ఇషా గుప్తా పరిచయం అవసరం లేదు. గ్లామర్ షో విషయంలో హద్దులు చెరిపేసి చెలరేగడం ఈ సీనియర్ బ్యూటీ ప్రత్యేకత. ఇన్ స్టా వేదికగా ఇషాగుప్తా ఎప్పటికప్పుడు చెలరేగి అందాలు ఆరబోస్తుంది. తాజాగా ఇషా షేర్ చేసిన బోల్డ్ ఫోటోషూట్ అంతర్జాలంలో దుమారం రేపుతోంది. ఇషాజీ మరోసారి తనదైన శైలిలో చెలరేగారు. ఈషా గుప్తా జెన్నీ ప్యాక్ మన్ ప్లాటినం గ్రే సీక్విన్డ్ గౌలో వజ్రంలా మెరుస్తోంది. ఫ్లోర్-లాంగ్ గౌనులో త్రీక్వార్టర్ లెంగ్త్ డ్రాప్డ్ స్లీవ్ లో గ్లామర్ ని ఆవిష్కరించిన తీరు కుర్రకారుకు మైండ్ బ్లాక్ చేస్తోంది. మోడల్ కం నటి పర్యావరణవేత్త అయిన ఈషా గుప్తా నటిగా ఇప్పటికే బాలీవుడ్ లో తనదైన ముద్ర వేసింది. తిరుగులేని ఎనర్జీతో స్టైల్ ఐకాన్ గా వెలుగులు విరజిమ్ముతోంది. తన స్టైల్ పై రెగ్యులర్ అప్ డేట్ లతో ఈషా ఇప్పటికే 13 మిలియన్లకు పైగా ఇన్ స్టాగ్రామ్ ఫాలోవర్ల ఫాలోవర్ లను సంపాదించింది. ఈషా గుప్తా నిరంతర ఫ్యాషన్ సెన్స్ పై నేటితరంలో డిబేట్లు సాగుతుంటాయంటే అర్థం చేసుకోవాలి. తాను ఎంచుకున్నది ఎత్నిక్ వేర్ అయినా... ఆరు గజాల పవిట కొంగుతో చీరలో అయినా.. అందమైన గౌనులో అయినా తన డ్రెస్సింగ్ సెన్స్ నుంచి కళు తిప్పుకోవడం అంత ఈజీ కాదు. ఈషా గుప్తా జెన్నీ ప్యాక్ మన్ ప్లాటినం గ్రే సీక్విన్డ్ గౌలో ఒంపులు రంగరించిన తీరుపై చర్చా సాగుతోంది. ఇషాజీ ఫ్యాషన్ ప్రపంచపు మహారాణి. రక రకాల ఫ్యాషన్ దుస్తులకు స్టైలింగ్ చేస్తూ మోడల్ గా అదరగొడుతుంటుంది. తన ఇన్ స్టాగ్రామ్ ఫోటోలలో ప్రయోగాలతో పాటు కాలానుగుణ వస్త్రధారణలతో తన ఆసక్తిని తరచుగా ప్రదర్శిస్తుంది. తళతళా మెరిసే దుస్తులతో ప్రతిసారీ డ్రీమ్ గాళ్ ని తలపిస్తుంది. మెరిసే గౌనులో ఈషా మరోసారి కళ్ళు తిప్పుకోనివ్వని ట్రీటిచ్చింది. ఈసారి జెన్నీ ప్యాక్ మన్ రాక్ ల నుండి ప్లాటినం గ్రే గౌనును ఎంచుకుంది. ఆమె ఫ్లోర్-లాంగ్ గౌనులో త్రీక్వార్టర్ లెంగ్త్ డ్రెప్డ్ స్లీవ్ తో ఆకట్టుకుంది. స్ట్రెయిట్ హెయిర్ నిగనిగల అందాలతో మెరిపించింది ఇషా. ఇషా గుప్తా టాలీవుడ్ కి సుపరిచితం. కానీ ఇక్కడ నటించేందుకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వలేదు. రామ్ చరణ్ వినయ విధేయ రామాలో హాట్ ఐటమ్ నంబర్ తో కట్టి పడేసినా ఆ తర్వాత కనిపించలేదు. 'జన్నత్' సినిమాతో బాలీవుడ్ లో లాంచ్ అయింది. ఆ తర్వాత అక్కడ బాగానే అవకాశాలు వస్తున్నాయి. కాలేజ్ డేస్ నుంచి సినిమాలంటే ఆసక్తి. దీంతో ఈషా మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టింది. ఆ తర్వాత ఎన్నో అందాల పోటీల్లో పాల్గోంది. ఫెమినా మిస్ ఇండియా పోటీల్లోనూ నెగ్గింది. చివరిగా బాలీవుడ్ లో నటిగా స్థిరపడింది. ప్రస్తుతం ప్రపంచ సుందరి పోటీలకు ఎంపికయ్యే మోడల్స్ కి ఇషా జీ శిక్షణను అందిస్తున్నారు. ఫెమీనా మిస్ ఇండియా జడ్జిగానూ ఇషా కు చాలా అనుభవం ఉంది. ఇటీవల బాబీ డియోల్ తో కలిసి 'ఆశ్రమ్ సీజన్ 2'లో ఈషా చివరిగా కనిపించింది. పలు భారీ చిత్రాలకు ఇషా గుప్తా సంతకాలు చేసింది. వాటి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

# మల్లె చెండు ఒళ్లంతా చుట్టుకుని కలకలం రేపిన నటి

అందుకే రాగిణి ద్వివేది ఉగాది స్పెషల్ ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. కొత్తొక వింత పాతొక రోత! పాత సంవత్సరానికి భాయ్ చెప్పి కొత్త సంవత్సరానికి వెల్ కం చెప్పింది కన్నడ నటి రాగిణి ద్వివేది. ఉగాది ఫర్వదినాన్ని పురస్కరించుకుని ఇదిగో ఇలా కొత్తగా కొంగొత్తగా తనని తాను పరిచయం చేసుకుంది. గతాన్ని తలుచుకుని సమయాన్ని వృధా చేసేందుకు రాగిణి సిద్ధంగా లేదు. భవిష్యత్ గురించి మాత్రమే ఆలోచిస్తోంది. అందుకే రాగిణి ద్వివేది ఉగాది స్పెషల్ ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. ఇదిగో ఇలా మల్లె చెండును ఒంటికి చుట్టుకుని, జెరీ అంచు బంగారు వర్ణం సిల్కు చీరలో దేవతా సుందరిలా మెరిసిపోతోంది. అలా పానుపుపై జేరబడి, మల్లెలను ముంజేతికి కట్టుకుని సువాసన పీలుస్తూ, అసలు రాగిణి ఇచ్చిన ఫోజ్‌లు కుర్రకారులో కలకలం రేపుతున్నాయి. పానుపుపై బంతిపూల దండల మధ్య రాగిణి రసరమ్యంగా మెరిసిపోతోంది. ఒక కొత్త సంవత్సరం, ఒక కొత్త అధ్యాయం – దానిని ఆశ – దృఢ సంకల్పంతో స్వీకరించండి! ప్రతి సూర్యోదయం ఒక కొత్త అవకాశాన్ని తెస్తుంది – దీనిని అద్భుత ప్రారంభంగా చేసుకోండి!

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# మళయాళ భామ 'కుమారి'గా వస్తుంది..!



మళయాళంలో తన నటతో మెప్పిస్తూ వస్తున్న ఐశ్వర్య లక్ష్మి ఈమధ్య తమిళ సినిమాల్లో కూడా సందడి చేస్తుంది. తెలుగులో గాడ్సే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఐశ్వర్య లక్ష్మి. రీసెంట్ గా పొన్నియిన్ సెల్వన్ 1 సినిమాతో కూడా అమ్మడు ఆకట్టుకుంది. సినిమాలో తన పోర్షన్ వరకు అదరగొట్టేసింది ఐశ్వర్య. సినిమాలే కాదు ఓటీటీ వెబ్ సీరీస్ లతో కూడా ఆడియన్స్ ని అలరిస్తుంది అమ్మడు. ఇటీవలే అమ్ము అంటూ ఓ తెలుగు వెబ్ సీరీస్ తో వచ్చిన ఐశ్వర్య లక్ష్మి ఆ సినిమాతో ప్రశంసలు అందుకుంది. ఆ మూవీ తర్వాత కొద్దిపాటి గ్యాప్ తోనే మరో మూవీతో వస్తుంది ఐశ్వర్య. ఈసారి కుమారి అంటూ ఒక మైథలాజికల్ ఫాంటసీ మూవీతో వస్తుంది. ఈ మూవీని నిర్మల్ సహదేవ్ డైరెక్ట్ చేశారు. నెట్ ఫ్లిక్స్ లో ఈ సినిమా నవంబర్ 18 శుక్రవారం రిలీజ్ అవుతుంది. అమ్ము సినిమాతో ఒక ఇంప్యాక్ట్ క్రియేట్ చేసిన ఐశ్వర్య లక్ష్మి కుమారితో కూడా అలరిస్తుందని అంటున్నారు. ఇప్పటికే నెట్ ఫ్లిక్స్ లో వస్తున్న కుమారి మూవీ టీజర్ ట్రైలర్ ఈ సీరీస్ పై ఆసక్తి కలిగించాయి. థియేటర్ లోనే వస్తేనే కాదు తమకు నచ్చిన కంటెంట్ ఎక్కడ రిలీజైనా సరే చూసేస్తున్నారు ప్రేక్షకులు. ముఖ్యంగా సినిమా టికెట్ల రేట్లు పెరగడం.. అంత ఖర్చు పెట్టి సినిమా చూసినా నిరాశపరచడం లాంటి కారణాల వల్ల థియేటర్ లో సినిమాలు చూసేందుకు ఆసక్తి చూపట్లేదు. అందుకే ఓటీటీలకు ఎక్కువ డిమాండ్ పెరిగింది. భాషతో సంబంధం లేకుండా ఓటీటీ లో వెరైటీ కంటెంట్ ఉంటే చాలు ప్రేక్షకులు విరగబడి చూసేస్తున్నారు. వెండితెర మీద అద్భుతాలు చేయాలని అనుకున్న ఔత్సాహిక కళాకారులకు కూడా ఈ ఓటీటీల్లో మంచి అవకాశాలు వస్తున్నాయి. అందుకే ఈమధ్య ఓటీటీల్లో మంచి మంచి కంటెంట్ సినిమాలు వస్తున్నాయి. తెలుగులోనే కాదు ఇతర భాషల సినిమాలు వెబ్ సీరీస్ లు కూడా మన ప్రేక్షకులు చూస్తున్నారు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com